సాక్షి నంద్యాల

మంగళవారం । 13 । జూన్ । 2023



మల్లన్నకు సహస్రదీపార్చన

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి స్వామిఅమ్మవార్లకు పూజలు చేశారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: నిత్యకళావేదికపై విజయవాడకు చెందిన అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ వారిచే నిర్వహించిన సంప్రదాయ నృత్య ప్రదర్శన పలువురు భక్తులను అలరించింది.



కోడి ధర 'సుర్రుమంటోంది'!

కోడి ధర మాంసం ప్రియులకు ఆందోళన కలిగిస్తోంది. కర్నూలులో కిలో చికెన్ రూ.340 నుంచి రూ.360 చొప్పున విక్రయిస్తున్నారు.

8లో▸

న్యూస్‌రీల్

రెవెన్యూలో బదిలీలు

నంద్యాల: జిల్లాలో రెవెన్యూ శాఖలో బదిలీలు జరిగాయి. ముగ్గురు తహసీల్దార్లు, 13 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 17 మంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, 8 మంది జూనియర్ అసిస్టెంట్లను బదిలీ చేస్తూ కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో మిడుతూరు తహసీల్దార్ సిరాజుద్దీన్‌ను ఆత్మకూరు ఆర్‌డీఓ ఆఫీసులో డీఏఓగా, బండిఆత్మకూరు తహసీల్దార్ ఉమారాణిని ఆత్మకూరు తహసీల్దార్‌గా, ఆత్మకూరు తహసీల్దార్ ప్రకాష్‌బాబును మిడుతూరు తహసీల్దార్‌గా కలెక్టర్ బదిలీ చేశారు.

నంద్యాల నుంచి పలు రైళ్లు రద్దు

బొమ్మలసత్రం: నంద్యాల నుంచి గుంతకల్లు మధ్య ట్రాక్ మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం నుంచి ఈనెల 18 వరకు పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ప్రకటనలో తెలిపారు. గుంటూరు – డోన్, డోన్ – గుంటూరు మధ్య నడిచే రైళ్లను ఆరు రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు టీపీఆర్‌వో రాకేష్ తెలిపారు. అదే విధంగా నంద్యాల నుంచి కర్నూలుకు ఉదయం 6 గంటలకు వెళ్లే డెమో రైలు 2.30 గంటల ఆలస్యం అనగా (ఉదయం 8.30 గంటలకు) నంద్యాల నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈనెల 17 వరకూ ఈ రైలు సమయంలో ఇవే మార్పులు కొనసాగుతాయని, ప్రయాణికులు గమనించాలని సూచించారు.

చట్టపరిధిలో ఫిర్యాదులకు సత్వర న్యాయం



దివ్యాంగుడి వద్దకు వచ్చి ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: చట్టపరిధిలో ఉన్న ఫిర్యాదులను విచారించి బాధితులకు పూర్తి న్యాయం చేకూరుస్తామని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 95 వినతులు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల నుంచి వచ్చిన వినతుల్లో కొన్ని సమస్యలను అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించామన్నారు. ఫిర్యాదుల్లో అధికంగా సివిల్ తగాదాలు, అత్తింటి వేధింపులు, అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయన్నారు. అనంతరం వినతులు అందజేయటానికి వచ్చిన బాధితులకు ఎస్పీ కార్యాలయంలో ఓంకార క్షేత్రం నిర్వాహకులు ఉచితంగా అన్నదానం నిర్వహించారు.

నేతన్న నేస్తానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ నేతన్న నేస్తం పథకానికి అర్హులైన చేనేత కుటుంబాలను ఎంపిక చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక విడుదలైంది. 2022–23లో లబ్ధిపొందిన వారు మినహా కొత్త వారు ప్రభుత్వం జారీ చేసిన షెడ్యూలు ప్రకారం ఈ నెల 20 వరకు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఈ నెల 21 నుంచి 23 వరకు పాతవారితో పాటు కొత్త దరఖాస్తుదారుల వివరాలను పరిశీలిస్తారు. ఈ నెల 25లోగా గ్రామ, వార్డు సచివాలయాల నుంచి జాబితాలు ఎంపీడీవోలకు, మున్సిపల్ కమిషనర్‌కు పంపుతారు. 27లోగా ఈ జాబితాలను పరిశీలించిన తర్వాత చేనేత, జౌళిశాఖ అధికారులకు అందచేస్తారు. ఈ నెల 28, 29 తేదీల్లో ఈ జాబితాలను సామాజిక తనిఖీల కోసం వార్డు, గ్రామ సచివాలయాల్లో ఉంచుతారు. ఈ నెల 30 నుంచి జూలై 5 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. జూలై 6, 7 తేదీల్లో తుదిజాబితాలను ఖరారు చేస్తారు. జూలై 8, 9 తేదీల్లో అర్హుల జాబితాలను జిల్లా కలెక్టర్లు ఆమోదిస్తారని ఉమ్మడి జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ హరికృష్ణ తెలిపారు.



ఆనందమానందమాయె..

గణగణ మంటూ బడి గంట మోగింది. ఉత్సాహంగా విద్యార్థులు బడి వైపు అడుగులు వేశారు. ఆహ్లాదకర వాతావరణంతో సర్కారు బడులు స్వాగతం పలికాయి. తొలి పాఠం ఆనందంగా సాగింది. ఓ వైపు విద్యా కానుక పంపిణీ సందడి.. మరో వైపు అడ్మిషన్ల కోలాహలం.. అంతా వెరిసి పండుగను తలపించింది. కిట్లు అందుకున్న విద్యార్థులు మురిసిపోయారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు చూసిన తల్లిదండ్రులు ఆశ్చర్యపోయారు. వేసవి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలల పునఃప్రారంభం వేడుకగా సాగింది.

– నంద్యాల

చదువుల గుడి.. డోన్ మండలం మల్యాల పాఠశాలకు స్వాగత తోరణాలు



తొలి పాఠం.. ఆనందం

- పండుగలా పాఠశాలల పునఃప్రారంభం
- వేడుకగా జగనన్న విద్యాకానుక పంపిణీ
- ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్లకు తరలివచ్చిన తల్లిదండ్రులు
- మెరిసిన వసతులు.. మురిసిన విద్యార్థులు

వేసవి సెలవులకు బైబై చెబుతూ.. ఇక చదువులకు సై అంటూ విద్యార్థులు తొలి రోజు ఉల్లాసంగా బడి బాట పట్టారు. జిల్లాలో పాఠశాలల పునఃప్రారంభం పండుగలా సాగింది. వడగాల్పుల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల సమయ వేళలు మార్చడంతో సోమవారం ఉదయం 7.30 గంటలకే బడిగంటలు మోగాయి. వేసవి అనంతరం మొదటి రోజు పాఠశాలలు తెరవడంతో పాఠశాలలను ఉపాధ్యాయులు అందంగా అలంకరించి విద్యార్థులకు స్వాగతం పలికారు. కొన్ని చోట్ల మామిడి తోరణాలు, కొబ్బరి మట్టలు, బంతి పూలతో అలంకరించి బడిని గుడిలా మార్చేశారు. ప్రభుత్వం చెప్పినట్లుగానే పాఠశాలలు పునఃప్రారంభం రోజే విద్యార్థులకు విద్యా కానుక పంపిణీ జరగడంతో అంతటా సందడి నెలకొంది. విద్యాకానుక కిట్లలోని మూడు జతల యూనిఫాం క్లాత్, బ్యాగ్, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్ట్, పిక్టోరల్ డిక్షనరీ, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను చూసి విద్యార్థులు మురిసిపోయారు. మొదటి రోజు జిల్లాలో 1,405 పాఠశాలలో 58,242 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇప్పటికే జిల్లాలో 1,62,276 మంది విద్యార్థులకు అవసరమైన విద్యాకానుక కిట్లను మండల విద్యాశాఖ అధికారులు స్వీకరించారు. కాగా తొలి రోజు విద్యాకానుక కిట్లను 43,361 మంది విద్యార్థులకు అందజేశారు. పలు పాఠశాల్లో ముందుగానే ఏర్పాట్లు చేయడంతో విద్యా కానుక పంపిణీ వేడుకను తలపించింది. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై కిట్లను పంపిణీ చేశారు. మరో వైపు బదిలీల్లో భాగంగా పలువురు ఉపాధ్యాయులు గతంలో పని చేస్తున్న చోట రిలీవ్ కావడం ప్రస్తుతం బదిలీ అయిన చోట బాధ్యతలు చేపట్టారు. తమ పాఠశాలకు కొత్త ఉపాధ్యాయులు వచ్చిన ఆనందం విద్యార్థుల్లో నెలకొంది.



ఇది మామయ్య కానుక.. చాపిరేవుల గ్రామంలో జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, డీఈఓ అనురాధ



ఆదోని మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తదితరులు

గోరుముద్ద.. నోరూరించగా..

వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా ఉదయం 11.30 గంటల వరకు ఈనెల 17వ తేదీ ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నారు. పాఠశాల సమయం ముగిసిన తర్వాత విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందజేశారు. సోమవారం మెనూ ప్రకారం పొంగలి, ఉడికించిన గుడ్డు, పలావ్, చిక్కీలు, రాగి జావ విద్యార్థులకు అందజేశారు. రాగి జావ పంపిణీకి సంబంధించిన గ్లాసులు విద్యార్థులకు అందజేశారు.

పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి..

పేద విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోని పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీని నంద్యాల మండలం చాపిరేవుల గ్రామ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులకు పంపిణీ చేసే బైలింగ్వల్ టెస్ట్ బుక్స్‌లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. 10వ తరగతి చదివే విద్యార్థులకు ఇంగ్లిష్, తెలుగు మీడియం వారీగా వచ్చిన పాఠ్య పుస్తకాలను సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. అలాగే విద్యార్థులకు ఇస్తున్న రాగి జావను కలెక్టర్ పరిశీలించి తను కూడా స్వీకరించారు. కార్యక్రమంలో డీఈఓ అనురాధ, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి లలిత తదితరులు పాల్గొన్నారు.



బేతంచెర్లలో విద్యా కానుక పంపిణీ కార్యక్రమ అతిథులకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

నైపుణ్యాభివృద్ధికి కృషి

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ఆదోనిరూరల్: విద్యార్థుల్లో నైపుణ్యాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆదోని పురపాలక పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యకానుక కిట్లను మంత్రి అందజేశారు. అనంతరం మంత్రి బుగ్గన మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యార్థులను చూసి నిరుపేద విద్యార్థులు నిరుత్సాహానికి గురి కాకూడదని రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యకానుక కిట్లను ఉచితంగా అందిస్తోందన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని పిలుపు నిచ్చారు. విద్యార్థులు ఉపాధి అవకాశాలు మెరుగు పరుచుకునే విధంగా రాష్ట్రంలోని 195 ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రత్యేక కోర్సులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు.



ఆహా ఏమి రుచి.. గడివేముల మండలం బూజునూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తింటున్న విద్యార్థులు



చూడ ముచ్చటగా.. సీఎం ప్రారంభిస్తున్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షిస్తున్న నెహ్రూనగర్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుడు



గురు దేవోభవ.. రుద్రవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చి సమావేశమైన ఉపాధ్యాయులు, హెచ్ఎం

జగన్ మామయ్య మేలు మరువం



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక మాలాంటి పేద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నారు. పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు వసతులు కల్పించి పాఠశాల ప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు స్కూల్ యూనిఫాంలు, బూట్లు అందించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తూ మాలాంటి పేద విద్యార్థులకు న్యాయం చేస్తున్నారు. జగన్ మామయ్య మేలును ఎన్నటికీ మరువం. – సుదీక్షిత రాణి, పదో తరగతి విద్యార్థిని, గోస్పాడు

మా ఊరి బడి ఎంతో బాగుంది



ప్రైవేటు పాఠశాలకు ఏ మాత్రం తీసిపోకుండా మా ఊరి బడిని ఎంతో అభివృద్ధి చేశారు. జగనన్న పాలనలో ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చేశారు. మా లాంటి పేద వారి పిల్లలకు మంచి చదువులు అందించేలా, వారికి అన్ని రకాల వసతులు కల్పించి ఆదుకుంటున్నారు. మాకు రూపాయి ఖర్చు లేకుండా బూట్లు, యూనిఫాం, పుస్తకాలు ఇవ్వడంతో పాటు రోజూ రుచికరమైన భోజనం పెట్టడం ఎంతో ఆనందంగా ఉంది. జగనన్న అమ్మ ఒడి కింద రూ.15వేలు అందజేస్తున్నారు. పేదలు బాగుపడేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కష్టపడుతున్నారు.
– శాంతమ్మ, జూలేపల్లె, గోస్పాడు మండలం



పాణ్యం మండలం గోరుకల్లులో విద్యార్థిని ఇంటికెళ్లి అడ్మిషన్ తీసుకుంటున్న హెచ్ఎం గీతాబాయి

అడ్మిషన్లకు క్యూ..

పిల్లల భవిష్యత్ కోసం జిల్లాలోని పలు పాఠశాలలో మొదటి రోజే అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు బారులుదీరారు. నాడు–నేడు కింద చేపట్టిన పనులతో పాఠశాలో మెరుగైన వసతులు ఏర్పాటు కావంతో తల్లిదండ్రులు ఆశ్చర్యానికి గురయ్యారు. విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు, తాగునీటి సౌకర్యం, టాయిలెట్లు తదితర సౌకర్యాలు కార్పొరేట్ తరహాలో ఉండటంతో ప్రభుత్వ తీరును కొనియాడారు. తమ ఊరిలోని ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో ప్రైవేటు పాఠశాలల్లో ఇక తమ పిల్లలను చేర్పించమని తేల్చి చెప్పారు. దీంతో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగే అవకాశం ఉందని విద్యాధికారులు చెబుతున్నారు. మొదటి రోజే పాణ్యం మండలంలో 80కి పైగా అడ్మిషన్లు వచ్చాయని ఎంఈఓ కోటయ్య తెలిపారు.

కామరాజు సస్పెన్షన్

కర్నూలు సిటీ: సమగ్ర శిక్ష కార్యాలయం పర్యవేక్షకులుగా పని చేస్తున్న కామరాజు సస్పెండ్ అయ్యారు. ఇటీవలే ఆదోనికి చెందిన ఏబీఎం సొసైటీ ఆధ్వర్యంలో ఉన్న ఎయిడెడ్ స్కూల్‌కి కరస్పాండెంట్ మార్పు విషయంలో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇదే విషయంలో కీలక పాత్ర పోషించిన ఆదోని డిప్యూటీ డీఈఓ సుకుమార్‌ను, కామరాజుకు డబ్బులు తీసుకొచ్చి ఇచ్చిన నైట్ వాచ్‌మ్యాన్ రమేష్‌లను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి ఈ నెల 8న అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించారు. దీంతో కామరాజును పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ కార్యాలయ అధికారి సస్పెండ్ చేశారు. నైట్ వాచ్‌మ్యాన్‌ను ఉద్యోగం నుంచి తొలగించనున్నారు. డిప్యూటీ డీఈఓను సైతం సస్పెండ్ చేసేందుకు జిల్లా విద్యాశాఖ నుంచి ఫైల్ పాఠశాల విద్య కమిషనర్‌కు వెళ్లింది. నేడో, రేపో సస్పెండ్ చేయనున్నట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

స్పందనలో వినతుల వెల్లువ

నంద్యాల: కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 235 వినతులు అందజేశారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ నిశాంతి, డీఆర్‌ఓ పుల్లయ్య, అధికారులు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ప్రతి వినతిని నాణ్యతతో వేగంగా పరిష్కరించాలన్నారు. ప్రతి సమస్యను పారదర్శకంగా అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారన్నారు. స్పందనలో వచ్చిన వినతులను 24 గంటల్లో ఓపెన్ చేసి పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జేసీ నిశాంతి

స్పందనలో కొన్ని వినతులు..

➡ గోస్పాడు మండలం ఒంటివెలగల గ్రామంలో 90 మంది ఎస్సీ కుటుంబాలు నిర్మించుకున్న చర్చి 167కే రోడ్డు నిర్మాణంలో సగ భాగం పోయే అవకాశం ఉన్నందున రోడ్డు నిర్మాణం10 మీటర్లు తూర్పు వైపునకు మళ్లించి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు అందజేశారు.

➡ ప్యాపిలిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో తన కుమార్తె ఐదవ తరగతికి ప్రవేశ పరీక్ష రాస్తే 37/50 మార్కులు వచ్చినప్పటికీ సీట్ రాలేదని, తమ కూతురికి గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని కోరుతూ డోన్ మండలం కమలాపురం గ్రామానికి చెందిన ఎన్.లక్ష్మి సాహిత్య కలెక్టర్‌కు విన్నవించారు.

➡ జూపాడుబంగ్లా మండలం తంగెడంచ గ్రామానికి చెందిన ఎం.మల్లేశ్వరి, మద్దిలేటి దంపతులకు ఇద్దరు పిల్లలు. తనకు ఆరోగ్యం సరిగ్గా లేక కాళ్లు, చేతులు పని చేయడం లేదని, భర్త తన్నును నా పిల్లలను పోషించకుండా వదిలివేసి వెళ్లారన్నారు. తనకు పెన్షన్ మంజూరు చేసి తన పిల్లలను ఆదుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు అందజేశారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈ నెల 13న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వుల మేరకు మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ సమావేశాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 గంటలకు గ్రామీణాభివృద్ధి, 11 గంటలకు వ్యవసాయం, 12 గంటలకు సాంఘిక సంక్షేమం, 1 గంటకు విద్య, వైద్యం.. 2.30 గంటలకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, 3.30 గంటలకు ఆర్థిక, ప్రణాళిక, పనులకు సంబంధించి ఆయా శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. సమావేశాలకు ఉమ్మడి జిల్లాకు చెందిన ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, కమిటీల చైర్‌పర్సన్లు, జెడ్పీటీసీలునిర్ణీత సమయంలోగా హాజరు కావాలని కోరారు.

తొలగిన ట్రాన్స్‘ఫార్మర్’ కష్టాలు

- ఏడాదిలో 6,614 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు
- అన్నదాతల దీర్ఘకాలిక ఎదురు చూపులకు చెక్
- కర్నూలు, నంద్యాల రైతుల కోసం రూ.297.70 కోట్లు ఖర్చు

కర్నూలు(రాజ్‌విహార్): వ్యవసాయ అవసరాల కోసం ట్రాన్స్‌ఫార్మర్లకు దరఖాస్తు చేసుకొని ఏళ్ల తరబడి వేచి చూసే ఎదురుచూపులకు చెక్ పడ్డాయి. ఏడాదిలో ఏకంగా 6,614 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేసిన ప్రభుత్వం అందుకు రూ.297.70కోట్లు ఖర్చు చేసింది. టీడీపీ హయాంలో ట్రాన్స్‌ఫార్మర్లను సకాలంలో మంజూరు చేయకపోగా ఏటా కోటా కేటాయిస్తూ హద్దులు పెట్టింది. దీంతో 2018 నుంచి వేల సంఖ్యలో దరఖాస్తులకు మోక్షం లభించకపోవడంతో అవి పెండింగ్‌లో ఉండిపోయాయి. అప్పటి నుంచి రైతులు ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. ఈ కష్టాలు తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెండింగ్ దరఖాస్తుల వివరాలు తెప్పించుకుంది. వాటికి కావాల్సిన ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు కావాల్సిన సామాగ్రిని మంజూరు చేసింది. దీంతో అధికారులు గత ఏడాది దరఖాస్తులతో పాటు ఈ ఏడాది 501 దరఖాస్తులకు మోక్షం కల్పించారు. పనులు పూర్తి చేసి రైతులకు విద్యుత్ సరఫరా అందించారు. దీంతో వారి కష్టాలు తొలిగిపోయాయి.

సాధారణ సీనియారిటీ ఇలా...

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే సీనియారిటీ చూస్తారు. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ నిబంధన ప్రకారం ట్రాన్స్‌ఫార్మర్ కావాలని దరఖాస్తు చేసుకునే సమయంలో డీడీ సమర్పించాలి. డబ్బు చెల్లించిన డీడీలోని తేదీని ప్రామాణికంగా తీసుకొని సీనియారిటీ తయారు చేస్తారు. ఇలా దరఖాస్తుల్లో ముందున్న వాళ్ల సీనియారిటీ ప్రకారం కనెక్షన్లు మంజూరు చేస్తూ వస్తారు. టీడీపీ హయాంలో దరఖాస్తులతో పాటు డబ్బులు చెల్లించి ఏళ్ల తరబడి ఎదురు చూసినా ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రం మంజూరయ్యేవి కావు.

ఏడాదిలో 6,614 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లకు మోక్షం కల్పించి రాష్ట్ర ప్రభుత్వం కావాల్సిన సామగ్రిని సైతం మంజూరు చేసింది. 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు వాటిని మంజూరు చేస్తూ వచ్చింది. అందుకు కావాల్సిన సామగ్రిని మంజూరు చేసింది. దీంతో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో గత ఏడాది జూన్ నుంచి 6,614 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఇందులో ఐదు డివిజన్లలోని రైతులకు 2022–23లో రూ.275.11కోట్లతో 6,113 ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చగా 2023–24లో ఇప్పటికే రూ.22.59కోట్లతో 501 ఏర్పాట్లు చేశారు. ఇందులో కరువు ప్రాంతంగా చెప్పుకునే ఆదోని డివిజన్‌కు అత్యధికంగా రూ.132.57కోట్లతో 2,946 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.

ఒక్కో రైతుకు రూ.1.50లక్షల వరకు ఖర్చు

ట్రాన్స్‌ఫార్మర్ అవసరం ఉన్న రైతులకు కొరత లేకుండా నిధులు మంజూరు చేశారు. ముఖ్యంగా వ్యవసాయ విద్యుత్ కోసం అర్హత ఉండి దరఖాస్తు చేసుకునే రైతుకు ప్రభుత్వం రూ.6,500కే విద్యుత్ కనెక్షన్ ఇస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్ అవసరం ఉన్న ఒక్కో అన్నదాతకు రూ.1.50లక్షల వరకు ఖర్చు చేసింది. నిధులు, ట్రాన్స్‌ఫార్మర్లు, సామగ్రి, సిబ్బంది కొరత లేకుండా చూడడంతో అత్యధిక పెండింగ్ దరఖాస్తులకు మోక్షం కల్పించారు.

ఏడాదిలో మంజూరు చేసి, ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల వివరాలు డివిజన్ల వారీగా..

డివిజన్ పేరు	ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు	ఖర్చు చేసిన నిధులు
ఆదోని	2,946	రూ.132.57కోట్లు
డోన్	1,125	రూ.50.62కోట్లు
కర్నూలు	247	రూ.11.15కోట్లు
కర్నూలు రూరల్	676	రూ.30.44కోట్లు
నంద్యాల	1,620	రూ.72.92కోట్లు
మొత్తం	6,614	రూ.297.70కోట్లు

ఫోన్లు చేసి.. విషయం చెప్పి

గతంలో ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే రైతులు అధికారులు, విద్యుత్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. ఆరు నెలల నుంచి పరిస్థితులు మారాయి. కావాల్సిన ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు కావడంతో వాటిని అమర్చాలనే నెలవారి, రోజువారి లక్ష్యాలు పెట్టారు. దీంతో అధికారులే దరఖాస్తు చేసుకున్న రైతులకు ఫోన్ చేసి.. ‘మీరు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ కావాలని అర్జీ పెట్టుకొని డీడీ చెల్లించారు. అందుకు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు అయింది. ఒకటి రెండు రోజుల్లో సామగ్రితో వచ్చి ఏర్పాటు చేస్తాం. మీరు అందుబాటులో ఉండి స్థలం చూపితే పెట్టేస్తాం’ అంటూ చెప్పడం విశేషం.



పొలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

పెండింగ్ దరఖాస్తులకు మోక్షం



వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు కావాలని దరఖాస్తు చేసుకున్న రైతుల విన్నపాలకు మోక్షం కలిగింది. ప్రభుత్వం పెండింగ్ దరఖాస్తులకు కావాల్సిన ట్రాన్స్‌ఫార్మర్లు, సామాగ్రి, నిధులు మంజూరు చేయడంతో వీలైనంత అధికంగా అమర్చాం. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఏడాదిలో 6వేలకు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టాం.

– ఎం. ఉమాపతి, ఎస్ఈ, ఉమ్మడి కర్నూలు ఆపరేషన్స్.

క్లుప్తంగా

ఆశాలకు ఉత్తీర్ణత సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): ఓపెన్ బేసిక్ ఎడ్యుకేషన్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన ఆశాలకు సోమవారం డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య తన ఛాంబర్‌లో ఉత్తీర్ణత సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనవరిలో నిర్వహించిన పరీక్షల్లో లెవెల్ ఎ-1, లెవెల్ బి-8, లెవెల్ సి021(మొత్తం 31) ఆశాలు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. ఇందులో లెవెల్ ఎ-1, లెవెల్ బి-8, లెవెల్ సి-21 పరీక్షలలో 30 మంది ఉత్తర్ణత సాధించారన్నారు. డీఐవో డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఆశాలకు కనీస చదువు ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓపెన్ బేసిక్ ఎడ్యుకేషన్‌లో ఉచితంగా నమోదు చేయించి వారి ఊరిలోనే తరగతులకు హాజరై చదువుకునేలా చేశామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఆర్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కుతుబుద్దీన్, ఆశాలు పాల్గొన్నారు.

కోడి ధర ‘సుర్రుమంటోంది’!

రోజురోజుకు పెరుగుతున్న ధరలు

- మే నెలలో కిలో ధర రూ.300లోపే
- ప్రస్తుతం కిలో రూ.340 నుంచి రూ.360
- ఎండల తీవ్రతకు కుదేలైన కోళ్ల పరిశ్రమ
- బ్రాయిలర్ కోళ్ల పెంపకాన్ని నిలిపేసిన రైతులు
- కంపెనీలు ఉత్పత్తి చేసిన కోళ్లే ఆధారం
- సిండికేట్‌గా మారిన వ్యాపారులు



కోడుమూరు మండలం ప్యాలకుర్తిలోని పౌల్ట్రీ పరిశ్రమలో కోళ్లు

కర్నూలు(అగ్రికల్చర్): కోడి ధర మాంసం ప్రియులకు ఆందోళన కలిగిస్తోంది. వారంలో రెండు, మూడు రోజులు ముక్క లేనిదే ముద్ద దిగని వాళ్లు ఈ పరిస్థితితో దిగాలు చెందుతున్నారు. జనాభలో 80 శాతం మాంసం ప్రియులే. పొట్టేలు మాంసం కిలో రూ.800 పైనే ఉండటంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు తినలేని పరిస్థితి ఉంది. అందువల్ల ఈ వర్గాల ప్రజలు బ్రాయిలర్ చికెన్‌తోనే సరిపెట్టుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితం వరకు కిలో ధర రూ.300లోపే ఉన్నా.. రెండు, మూడు వారాలుగా బ్రాయిలర్ చికెన్ ధరలు కొండెక్కాయి. వేసవి ప్రభావం కోళ్ల(పౌల్ట్రీ) పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇదే సమయంలో గుడ్ల ధర కూడా అమాంతం పెరిగింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సారి ఉష్ణోగ్రతలు దాదాపు 45-46 డిగ్రీలు దాటడం గమనార్హం. ఈ కారణంగా కోళ్ల మరణాలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటున్నాయి. వేసవిలో రైతులు బ్రాయిలర్ కోళ్ల పెంపకాన్ని నిలిపేస్తారు. ఇదే సమయంలో చికెన్ వ్యాపారుల సిండికేట్ కావడం ధరల పెరుగుదలకు కారణమవుతోంది. సాధారణంగా వేసవిలో కోడి మాంసం ధరలు తగ్గాల్సి ఉంది. చికెన్ తింటే వేడి చేస్తుందనే భయంతో చాలమంది వెనుకంజ వేస్తారు. ఇందువల్ల అమ్మకాలు తగ్గతాయి. అయితే అందుకు విరుద్ధంగా చికెన్ ధరలు అడ్డగోలుగా పెరగడం గమనార్హం.

కిలో చికెన్ ధర రూ.360

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎక్కడా లేని విధంగా బ్రాయిలర్ చికెన్ ధరలు కర్నూలు నగరంలో ఎక్కువగా ఉంటున్నాయి. కర్నూలుకు 35 కిలోమీటర్ల దూరంలోని వెల్దుర్తి, కోడుమూరులలో కిలో ధర రూ.280 వరకు ఉంటోంది. డోన్‌లో రూ.300 పలుకుతోంది. కర్నూలు నగరంలో మాత్రం రూ.340 నుంచి రూ.360 చొప్పున విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణలో కూడ రైతుల దగ్గర బ్రాయిలర్ కోళ్లు అతి తక్కువగా ఉన్నాయి. కోళ్లకు ప్రస్తుతం కంపెనీలే ఆధారం. సుగుణ, స్నేహ, వెంకబ్, ప్రీమియర్ తదితర కంపెనీల్లో బ్రాయిలర్ కోళ్లు ఉన్నాయి. రైతుల దగ్గర బ్రాయిలర్ కోళ్ల ఉత్పత్తి బాగా తగ్గిపోవడంతో కంపెనీలు అడ్డుగోలుగా ధరలు పెంచేశాయి. మాంసం ధరలపై నియంత్రణ లేకపోవడంతో కొరతను బూచిగా చూపి ధరను పెంచేయడం ఆందోళన కలిగిస్తోంది.

‘గుడ్లు’ తేలేయాల్సిందే..

బ్రాయిలర్ కోడి మాంసంతో పాటు కోడి గుడ్ల ధర కూడా పోటీపడి పెరుగుతోంది. మే నెలలో 100 గుడ్ల ధర ఫారం దగ్గర రూ.400 ఉండగా.. నేడు రూ.500లకు చేరింది. ఇక రిటైల్ విషయానికొస్తే డజన్ గుడ్ల ధర రూ.70-75, 100 గుడ్ల ధర రూ.550 నుంచి రూ.600 వరకు విక్రయిస్తున్నారు. ఈ ధరలతో ప్రజలు ‘గుడ్లు’ తేలేస్తున్నారు.



చికెన్ ధర రూ.360 అంటూ ఏర్పాటు చేసిన బోర్డు

వడదెబ్బతో అధికమైన కోళ్ల మృతి

- జిల్లాలో కోళ్ల పరిశ్రమలో రాణిస్తున్న రైతులు 60-70 మంది ఉన్నారు.
- బ్రాయిలర్ కోళ్లు 5 లక్షల వరకు ఉండగా.. గుడ్ల కోళ్ల సంఖ్య 3లక్షలు. నాటు కోళ్లు 15వేల వరకు ఉన్నాయి.
- సాధారణ పరిస్థితుల్లో కోళ్లలో మరణాలు 2-3 శాతం. వేసవిలో 5 శాతం.
- ఎండల తీవ్రత వల్ల కోళ్లు మార్చి నుంచి ఏప్రిల్ వరకు దాదాపు 40 వేల వరకు మరణించినట్లు తెలుస్తోంది.
- ఉష్ణోగ్రతలు 38-40 డిగ్రీల వరకు ఉంటే కోళ్లకు ఇబ్బంది ఉండదు. అదే 40 డిగ్రీలు దాటితే తట్టుకోవడం కష్టమవుతుంది.

పెరుగుదలపై వేసవి ప్రభావం

వేసవిలో కోళ్లలో పెరుగుదల తగ్గిపోతుంది. బరువు పెరగడంలో ఆలస్యం అవుతుండటం వల్ల మార్కెట్‌లో కొరత ఏర్పడుతోంది. వేసవిలో కోళ్లు నీళ్లు ఎక్కువగా తాగుతాయి. శీతాకాలంలో మాదిరి దాణాను తినవు. కోడిపిల్ల 2కిలోల బరువుకు చేరాలంటే 35 రోజులు పడుతుంది. వేసవిలో బ్రాయిలర్ కోళ్లు 2 కిలోల బరువు పెరగడానికి 45 నుంచి 50 రోజుల సమయం పడుతుంది. కోళ్ల కొరత ఏర్పడటానికి బ్రాయిలర్ కోళ్లు త్వరగా బరువు పెరగక పోవడం కూడా ఒక కారణమని పౌల్ట్రీ పరిశ్రమ నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు.

కోళ్లపై ఎండల ప్రభావం



ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటితే కోళ్లు వేడిని తట్టుకోలేవు. ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా మరణాలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటున్నాయి. ఈ సారి వేసవిలో దాదాపు 3,500 కోళ్లు మరణించాయి. దాణా ధరలు పెరిగాయి. వర్షాలు పడే వరకు ఈ పరిస్థితి తప్పదు.

– సి.వెంకటేశ్వర్లు, పౌల్ట్రీఫాం, ప్యాలకుర్తి, కోడుమూరు మండలం

30 శాతం అమ్మకాలు తగ్గాయి

బ్రాయిలర్ మాంసం ధలు పెరుగడంతో అమ్మకాలు గణనీయంగా తగ్గాయి. చికెన్ ధర రూ.300లోపు ఉన్నప్పుడు వారానికి 500 కిలోల వరకు అమ్మేవాళ్లం. ధరలు పెరిగిన తర్వాత వారానికి 350 కిలోలకు మించడం లేదు. వారంలో రెండు, మూడు రోజులు చికెన్ తినేవాళ్లు ఇప్పుడు రెండు రోజులకే పరిమిత్తం అయ్యారు.

– పృథ్వీ, చికెన్ సెంటర్ యజమాని, కర్నూలు

వారంలో ఒక్క రోజే..



పొట్టేలు మాంసం కిలో రూ.800 పైనే ఉండటంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తినలేని పరిస్థితి ఉంది. ఇప్పుడు బ్రాయిలర్ కోడి మాంసమే దిక్కు. రెండు వారాల క్రితం వరకు రెండు, మూడు రోజులు చికెన్ తినేవాళ్లం. ధర పెరగడంతో ఇప్పుడు వారంలో ఒక్క రోజుతో సరిపెట్టుకోవాల్సి వస్తుంది. గుడ్ల ధర కూడా అమాంతం పెరిగిపోయింది.

– నరసింహ, బుధవారపేట, కర్నూలు

న్యాక్ కేంద్రంలో ఉచిత శిక్షణ

డోన్ టౌన్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ, పీఎంకేవీవై సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులకు డోన్‌లో ఉచితంగా శిక్షణ ఇచ్చి వారిలో నైపుణ్యం పెంపొందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు డోన్ ఇన్‌చార్జ్ తిమోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేయర్, అసిస్టెంట్ ప్లంబర్ కోర్సులలో రెండు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కోర్సులలో జాయిన్ అవ్వడానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా ఉన్న న్యాక్ కేంద్రంలో ఆసక్తి కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలతో పాటు రెండు పాస్ ఫొటోలతో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 8328646601-766182864 నంబర్లను సంప్రదించాలన్నారు.

13 మంది డీటీలకు తహసీల్దార్లుగా పదోన్నతి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో పనిచేస్తున్న 13 మంది డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతి లభించింది. ఇటీవల సీసీఎల్ కార్యదర్శి సాయిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన డిపార్టుమెంట్ ప్రమోషన్ కమిటీ(డీపీసీ) జోన్-4లో మొత్తం 36 మందికి పదోన్నతులను అడ్‌హాక్ పద్ధతిలో కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో కర్నూలు జిల్లాకు చెందిన 13 మంది డిప్యూటీ తహసీల్దార్లు ఉన్నారు. వీరిని జోన్-4 పరిధిలోని జిల్లాలకు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

డిప్యూటీ తహసీల్దార్ పేరు	తహసీల్దార్‌గా కేటాయించిన జిల్లా
ఎస్.వెంకటరమణ	కర్నూలు
వై.రామనాథ్‌రెడ్డి	సత్యసాయి
కె.రామదేవి(ఎస్‌టీ)	సత్యసాయి
ఎస్.రవికుమార్	నంద్యాల
కె.రామాంజనేయులు(ఎస్‌సీ)	కర్నూలు
ఆర్.రవికుమార్	సత్యసాయి
జేపీ శోభ సువర్ణమ్మ(ఎస్‌సీ)	సత్యసాయి
డి.సుభాకరరావు(ఎస్‌సీ)	నంద్యాల
బి.సువర్ణదేవి(ఎస్‌సీ)	వైఎస్ఆర్ కడప
వీ.రాజారావు(ఎస్‌సీ)	వైఎస్ఆర్ కడప
జి.సుబ్రమణ్యం(ఎస్‌సీఅండ్ ఓహెచ్)	నంద్యాల
ఎస్.జ్ఞానేశ్వరి	అన్నమయ్య
ఎస్.పద్మావతమ్మ (ఎస్‌సీ)	అన్నమయ్య

వేరుశనగకు పెరిగిన డిమాండ్

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో వర్షాలు పడుతుండటంతో వేరుశనగకు డిమాండ్ పెరిగింది. జిల్లాకు సబ్సిడీపై పంపిణీ చేసేందుకు 15,905 క్వింటాళ్లు కేటాయించగా.. ఇప్పటికే ఏపీసీడ్స్ 12,500 క్వింటాళ్ల వేరుశనగను రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచింది. రైతులు 10,500 క్వింటాళ్లకు నాన్ సబ్సిడీ అమౌంటు కూడా చెల్లించారు. కాగా వేరుశనగకు కొరత ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లుగా జిల్లా అధికారులు తెలిపారు.

ఎల్ఐసీ జోనల్ కమిటీ చైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి



నియామక పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

గోస్పాడు: లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జోనల్ (ఏపీ, తెలంగాణ, కర్ణాటక) పొలిటికల్ యాక్షన్ కమిటీ చైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆల్ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ల కమిటీ జనరల్ సెక్రటరీ శ్రీనివాస ఆచారి, జోనల్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు నగరంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో పొలిటికల్ యాక్షన్ కమిటీ జోనల్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. గోస్పాడు మండలం నెహ్రూనగర్ గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి గతంలో నంద్యాల బ్రాంచ్ అధ్యక్షుడిగా ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా, కడప డివిజన్ ట్రెజరర్‌గా గౌరవ అధ్యక్షుడిగా సేవలు అందించారు. నూతనంగా జోనల్ చైర్మన్‌గా ఎంపికైన శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏజెంట్ల సంఘం డివిజన్, జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.

ఆటోను ఢీ కొన్న కారు.. 9 మందికి గాయాలు

- ముగ్గురి పరిస్థితి విషమం



క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చిన దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: ఎర్రకోట గ్రామ సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం సాయంత్రం ముందు వెళ్తున్న ఆటోను వెనకనుంచి వేగంగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. ఎమ్మిగనూరు నుంచి గోనెగండ్ల మండల పెద్దమర్రివీడుకు ఆటోలో ప్రయాణికులు వెళ్తున్నారు. ఎర్రకోట సమీపంలో సబ్‌స్టేషన్ దగ్గర ఎదురుగా ఆర్టీసీ బస్సు రావడంతో ఆటో డ్రైవర్ బ్రేక్ వేశాడు. దీంతో వెనక నుంచి కర్నూలు వైపు వేగంగా వెళ్తున్న ఆన్ గవర్నమెంట్ డ్యూటీ అనే స్టిక్కర్ ఉన్న కారు..ఆటోను బలంగా ఢీ కొట్టింది. ఆటో పల్టీలు కొట్టడడంతో అందులో ఉన్న గువ్వలదొడ్డికి చెందిన హాజీరా, మాబి, ఖాజబీ, పెద్దమర్రివీడుకు చెందిన లక్ష్మి, భారతి, పెద్దక్క, చాకలి రాముడు, నరసింహులు, రాముడుకు గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వారు గాయపడ్డ వారిని రెండు 108 వాహనాల్లో చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లక్ష్మి, భారతి, హాజీబిల పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కారులో ఉన్న డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



కారు ఢీ కొనడంతో నుజ్జునుజ్జు అయిన ఆటో

సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన

- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



తుగ్గలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన సాధ్యమవుతోందని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. సోమవారం ఆదోనికి వెళుతూ మార్గమధ్యలో తుగ్గలి ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలోని సచివాలయ వ్యవస్థను దేశంలోని అన్ని రాష్ట్రాలు అమలు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నాయన్నారు. గత ప్రభుత్వాల హయాంలో చిన్న పాటి పనులకు ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఈ పరిస్థితిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సమూలంగా మార్చేసిందన్నారు. సొంతూర్లోనే సచివాలయాలకు వెళ్లి సమస్యలు పరిష్కరించుకునే అవకాశం లభించిందన్నారు. సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటుతో అన్ని సేవలు గ్రామస్థాయిలోనే అందుతున్నాయని చెప్పారు. సచివాలయాల్లో త్వరలో ఆధార్, రిజిస్ట్రేషన్ వంటి సేవలు కూడా ముమ్మరమవుతాయన్నారు. మండలంలోని తండాల్లో పలు అభివృద్ధి పనుల ప్రతిపాదనలు జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్ తన దృష్టికి తీసుకొచ్చినట్లు జెడ్పీ చైర్మన్ తెలిపారు.

వంటల పోటీల్లో జిల్లాకు అవార్డులు



అవార్డులు పొందిన వారితో అసిస్టెంట్ డైరెక్టర్ శ్యామ్యూల్ పాల్

కర్నూలు సిటీ: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా స్కూళ్లలో వంట చేసే ఏజెన్సీలకు నిర్వహించిన పోటీల్లో జిల్లాకు చెందిన వారికి రాష్ట్ర స్థాయిలో అవార్డులు వచ్చాయి. అవార్డులు పొందిన వారిని సోమవారం కర్నూలులో డీఈఓ డాక్టర్ వి రంగారెడ్డి, ఏపీ మధ్యాహ్న భోజన పథకం అసిస్టెంట్ డైరెక్టర్ శ్యామ్యూల్ పాల్ అభినందించారు. ఈ సందర్భంగా డీఈఓ, అసిస్టెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ వంటల పోటీలను ఈ నెల 6న విజయవాడలో నిర్వహించారన్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి రెండు వంట ఏజెన్సీలను ఎంపిక చేసి పంపారన్నారు. కల్లూరు మండల పరిధిలోని శరీన్ నగర్ ఎంపీపీఎస్(రెగ్యులర్)కి చెందిన గంగమ్మకు రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి, కస్తూరినగర్ ఎంపీపీస్ స్కూల్‌కి చెందిన రమీజాబికి రెండో బహుమతి వచ్చాయన్నారు. అభినందించిన వారిలో కల్లూరు ఎంఈఓ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

వివాహిత బలవన్మరణం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గువ్వలదొడ్డి గ్రామానికి చెందిన కురవ రామలక్ష్మి(20) అనే వివాహిత సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన కురవ ఆంజనేయులు, మల్లేశమ్మకు ఇద్దరు కమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమార్తె హనుమంతమ్మను ఆదోని మండలం బైచిగేరికి చెందిన ఫక్కీరప్పకు ఇచ్చి 20 సంవత్సరాల కిత్రం పెళ్లి చేశారు. వారి కుమార్తె రామలక్ష్మి(20)ని ఆంజనేయులు తన చిన్న కుమారుడు ఉరుకుందుతో మూడు సంవత్సరాల క్రితం పెళ్లి జరిగిపించాడు. వీరికి షర్మిల(2) అనే బాలిక ఉంది. సోమవారం ఇంట్లో ఉన్న ఉరుకుందు, రామలక్ష్మీల మధ్య చిన్నపాటి గొడవ జరిగినట్లు చెపుతున్నారు. మనస్తాపంతో పెరుగు అన్నంలో రామలక్ష్మీ పురుగుల మందు కలుపుకొని తిని ఆత్మహత్యాయ్నానికి పాల్పడింది. చికిత్స కోసం కర్నూలుకు తరలిస్తుండగా కోడుమూరు దగ్గర రామలక్ష్మి మృతి చెందటంతో మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. మృతురాలు తల్లిదండ్రులు కడపకు వలస వెళ్లటంతో వారికి సమాచారం అందించారు.

మామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులు

- వర్షాకాలంలో మూడుసార్లు లోతుగా దున్నాలి
- చనిపోయిన చెట్ల స్థానంలో కొత్త అంట్లు నాటాలి
- రైతులకు ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు పి.రామాంజనేయులు సూచనలు



కర్నూలు(అగ్రికల్చర్): మామిడి పంట ముగింపు దశకు వచ్చింది. ఇప్పటికే పలు తోటల్లో పంటను పూర్తిగా కోశారు. మిగిలిన తోటల్లో మరికొన్ని రోజుల్లో పూర్తి అయ్యే అవకాశం ఉంది. మామిడి తోటల యాజమాన్యంలో అంతర సేద్యం చాలా ముఖ్యం. తోటల్లో చెట్ల మధ్య ఖాళీ స్థలం దున్నటం వల నేల గుల్లబారి భౌతిక స్థితి మెరుగుపడుతుంది. నేలలో గాలి ప్రసరించి బాగా పెరుగుతాయి. కలుపు మొక్కల బెడద ఉండదు. తద్వారా నీటికి, పోషకాల వినియోగానికి పోటీ ఉండదు. అంతేగాక నేలలోనే నివసించే హానికర పురుగులు నశిస్తాయి. కోత అనంతరం మామిడిలో చేపట్టాల్సిన పనులను, వివిధ కార్యక్రమాలను జిల్లా ఉద్యానశాఖ సహాయ సంచాలకులు పి.రామాంజనేయులు తెలిపారు. వివరాలు ఆయన మాటల్లోనే..



మామిడి తోట

- కాపునకు వచ్చిన తోటల్లో తొలకరి వర్షాలకు జూన్, జులై నెలల్లో మొదటిసారి, ఆగస్టులో రెండోసారి, అక్టోబర్-నవంబర్ నెలల్లో మూడోసారి భూమిలో పదును చూసుకుని దున్నుకోవాలి. మొదటి దుక్కికి వర్షపు నీరు భూమిలోకి బాగా ఇంకిపోయి నేలకోత అంతగా ఉండదు. రెండో దుక్కికి కలుపు నివారణ అవుతుంది. మూడో దుక్కి పూత రావడానికి దోహద పడుతుంది. నేలలో ఉండే పిండి పురుగులు, పండు ఈగ తాలూకు కోశస్థ దశలు నశిస్తాయి. దుక్కి వాలుకు అడ్డంగా దున్నాలి.
- తోటలో భూమి వాలును బట్టి ప్రతి 10-15 చెట్లకు చుట్టూ పెద్ద అడ్డకట్టలు, కాంటూరు గట్లు వేయాలి. దీనివల్ల వర్షపు నీరు, సత్తువ బయటకు కొట్టుకుపోదు. నేలలో తేమ బాగా ఉంటుంది. ఎండు పుల్ల పడదు. వేరుకుళ్లు అంతా ఆశించదు.
- ఎరువులు ముఖ్యంగా నత్రజని, భాస్వరం, పొటాష్ పోషకాల్ని సకాలంలో సిఫారసు చేసిన మోతాదులో వేయాలి. వయస్సును బట్టి ఒక్కొక్క చెట్టుకు ఒక సంవత్సరానికి ఏయే ఎరువులు ఎంత మోతాదులో వేయాలో తెలుసుకోవాలి.
- మామిడి తోటల్లో సూక్ష్మ ధాతు లోపాలు కనిపిస్తుంటాయి. కాయలు కోయడం పూర్తి అయిన వెంటనే చెట్లు పుంజుకోవడానికి జింక్ సల్ఫేట్ 5 గ్రాములు + యూరియా 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆ తర్వాత సూక్ష్మ దాతువులైన జింక్, మెగ్నీషియం, ఇనుము, బోరాన్, మాంగనీస్‌ల మిశ్రమ ద్రావణాన్ని తయారు చేసి జూలై, ఆగస్టు నెలల్లో, చెట్లు కొత్త ఆకు తొడిగేటప్పుడు రెండవసారి పిచికారీ చేయాలి. జింక్ 5 గ్రాములు, మెగ్నీషియం 2 గ్రాములు, మాంగనీస్ సల్ఫేట్ 2 గ్రాములు, ఫెర్రస్ సల్ఫేట్ 2 గ్రాములు, బోరాన్ 2 గ్రాములు, సున్నం 6 గ్రాములు, యూరియా పది గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- తోటల్లో అక్కడక్కడ చెట్లు చనిపోయి ఖాళీలు ఏర్పడతాయి. ఈ ఖాళీల్లో మొక్క పెట్టేచోట మళ్లీ ఒక మీటరు పొడవు, వెడల్పు, ఒక మీటరు లోతు సైజులో గుంతలు తీయాలి. గుంతలు తవ్వేటప్పుడు పై అర మీటరు లోతు మట్టిని ఒక పక్కకు లోపలి అర మీటరు మట్టిని మరోవైపు వేర్వేరుగా కుప్పలు వేయాలి. పై మట్టికి 100 కిలో చివికిన పశువుల ఎరువు లేదా 30 కిలోల వర్మీకంపోస్టు, 2 కిలోల సూపర్ ఫాస్ఫేట్ కలపాలి. చెదలు ఆశించకుండా 100 గ్రాముల లిండేన్/ ఫాలిడాన్(5 శాతం) పొడి మందును, మట్టి ఎరువు మిశ్రమానికి కలపాలి. గుంతను మొదట ఈ మిశ్రమంతో నింపాలి. తక్కువైతే పక్కనున్న మట్టితో గుంత నింపుకుని నాటే ముందు రోజు గుంటకు నీరు పెడితే పోత మన్ను బాగా కుంగుతుంది. గుంత మధ్య భాగంలో కొంచెం మట్టిని తోడి, అంటు వేర్లకున్న మట్టి కదలకుండా, రాలకుండ ముద్దలా ఉంచి మరికొంత మట్టిని చేర్చి కాంప్యాక్ చేయాలి.